# అప్పా-మన్నెగూడ రహదారి విస్తరణకు

# ఎన్జీటీ గ్రీన్ సిగ్నల్

**అభ్యంతరాలను తోసిపుచ్చిన హరిత ట్రిబ్యునల్**

**హైవేరోడ్ నిర్మాణానికి కృషి చేసిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి**

షాబాద్, నవంబర్ 6 : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదారాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లా మీదుగా వెళ్లే బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు వేగంగా అడుగులు పడ్డాయి. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్లుగా అభివృద్ధి జరుగనున్నది. 46 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కానుంది. ఇప్పటివరకు రహదారి నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలు తొలగిపోయాయి. సోమవారం జాతీయ హరిత ట్రిబ్యునల్ వెల్లడించిన తీర్పులో భాగంగా ఈమేరకు నిర్మాణాన్ని తలపెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దానిపై అభ్యంతరాలు లేవనెత్తినా వాటిని పూర్తిగా తోసిపుచ్చింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తికాగా.. ఈ నెలాఖరులో పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రూ.928.41 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నారు. రహదారి విస్తరణ నిమిత్తం 350 ఎకరాల మేర భూములను సేకరించారు. రహదారి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే వాహనాలు నేరుగా జాతీయ రహదారిపైకి రాకుండా అండర్‌పాస్ బ్రిడ్జిలను కూడా నిర్మించేందుకు ప్రణాళికను రూపొందించారు. మొత్తంగా ఆరు భారీ, ఎనిమిది చిన్న అండర్‌పాస్ బ్రిడ్జిలతో పాటు బైపాస్ రోడ్లనూ నిర్మించేందుకు ప్లాన్ చేశారు. ఇందులో మొయినాబాద్, చేవెళ్ల వద్ద బైపాస్ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే అంగడిచిట్టంపల్లి వద్ద 12 లైన్ల టోల్‌ప్లాజాను ఏర్పాటు చేయనున్నారు.



అప్పా టు మన్నెగూడ బీజాపూర్ జాతీయ రహదారి

### అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్లుగా అభివృద్ధి

బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు వేగంగా చేపట్టింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులు షురూ చేయడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించారు. బీజాపూర్ జాతీయ రహదారి వెళ్లే అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్లుగా నిర్మించనున్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించడంతోపాటు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో నిర్మాణం చేపట్టేందుకు జాతీయ రహదారుల శాఖ సమాయత్తమవుతున్నది. అదే విధంగా భూ సేకరణ ప్రక్రియను కూడా పూర్తి చేసే పనిలో నిమిగ్నమయ్యారు సంబంధిత అధికారులు. మూడేండ్లుగా బీజాపూర్ జాతీయ రహదారిపై అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల, మన్నెగూడ, పరిగి, కర్ణాటకలోని బీజాపూర్ వరకు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. వారాంతపు సెలవుల్లో అయితే అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు అధిక ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా రహదారి చిన్నగా ఉండడం, వాహనాలు పెరగడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లకు ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని నాలుగు లైన్ల రహదారిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

### రూ.928.41 కోట్లతో రహదారి విస్తరణ

అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల మేర బీజాపూర్ జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించనున్నారు. దీని కోసం రూ.928.41 కోట్లు ఖర్చు చేయనున్నారు. తొలుత రూ.800 కోట్లతో అంచనాలను రూపొందించినప్పటికీ, తాజా అంచనాల ప్రకారం మరో రూ.128 కోట్లకు పెంచారు. అదేవిధంగా అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులకు 350 ఎకరాల మేర భూములను సేకరించనున్నారు. ఇప్పటికే ఉన్న జాతీయ రహదారుల మాదిరిగా కాకుండా ఎక్స్‌ప్రెస్ వే తరహాలో బీజాపూర్ జాతీయ రహదారి అందుబాటులోకి రానున్నది. అప్పా జంక్షన్ నుంచి బీజాపూర్ రహదారి ప్రస్తుతం కొన్ని చోట్ల 25 మీటర్లు, మరికొన్ని చోట్ల 30 మీటర్లుగా ఉంది. రోడ్డు విస్తరణలో భాగంగా 60 మీటర్ల మేర రహదారిగా విస్తరించి నాలుగు లైన్లుగా మార్చనున్నారు. ఇప్పటికే మన్నెగూడ నుంచి పరిగి, కొడంగల్, బీజాపూర్ వరకు 45 కిలోమీటర్ల మేర మూడు లైన్ల రహదారిగా అందుబాటులోకి తీసుకువచ్చారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు వెళ్లే జాతీయ రహదారి మధ్య ఉన్న గ్రామాల నుంచి వచ్చే వాహనాలు నేరుగా జాతీయ రహదారిపైకి రాకుండా అండర్‌పాస్ బ్రిడ్జిలను కూడా నిర్మించనున్నారు. 46 కిలోమీటర్ల పరిధిలో ఆరు భారీ అండర్‌పాస్ బ్రిడ్జిలను, ఎనిమిది ప్రాంతాల్లో చిన్న అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించి అందుబాటులోకి తీసుకురానున్నారు. బైపాస్ రోడ్లను కూడా నిర్మించేందుకు ప్లాన్ చేశారు. రెండు బైపాస్ రోడ్లు కూడా జిల్లాలోనే నిర్మించనున్నారు. మొయినాబాద్ వద్ద 4.35 కిలోమీటర్ల మేర, చేవెళ్ల వద్ద 6.36 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లను నిర్మిస్తామని అధికారులు వెల్లడించారు.

# ప్రగతి పరుగులు

- వికారాబాద్ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి
- ఇటీవల రూ.173 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి కేటీఆర్
- గతంలో అధమ స్థానంలో... ప్రస్తుతం ప్రగతిపథంలో ముందుకు
- హర్షం వ్యక్తం చేస్తున్న వికారాబాద్‌వాసులు

వికారాబాద్, నవంబర్ 6 : గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో వికారాబాద్ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడింది. అప్పటి పాలకులు ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. అన్ని రంగాల్లోనూ అధమ స్థాయిలో నిలిచింది. కానీ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మహర్దశ వచ్చింది. ప్రజల చిరకాల కోరికైన వికారాబాద్ జిల్లా ఏర్పడింది. సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో తొమ్మిదిన్నరేండ్ల కాలంలో వికారాబాద్ జిల్లా ప్రగతిపథంలో ముందుకు సాగుతున్నది. రూ.173 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కలెక్టరేట్ భవనం ఏర్పాటుతోపాటు రూ.235 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ప్రభుత్వం ముమ్మరం చేసింది. రూ.96 కోట్లతో వికారాబాద్ రైల్వేవంతెన, రూ.7.20 కోట్లతో పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయి. అదేవిధంగా రూ.1.10 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ గిరిజన భవనం పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవంతోపాటు రూ. కోటితో చేపట్టనున్న ప్రభుత్వ గిరిజన కళాశాల, బాలికల వసతి గృహాలకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు చేశారు. రూ.1.54 కోట్లతో నిర్మించిన కేజీబీవీ బాలికల పాఠశాలలో అదనపు తరగతి గదులు, ల్యాబ్, రూ.1.54 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.48.69 లక్షలతో నిర్మించిన సఖీ సెంటర్ ప్రారంభోత్సవాలను పూర్తి చేసుకున్నాయి. అదేవిధంగా రామయ్యగూడ, ఆలంపల్లి వైకుంఠధామాల నిర్మాణ పనులకు రూ.2 కోట్లు, వికారాబాద్ పట్టణంలోని పార్కుల సుందరీకరణ, అభివృద్ధి పనులకు రూ.5కోట్లు మంజూరు కాగా.. రూ.25 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులు, రూ.30 కోట్లతో చేపట్టనున్న నాలుగు వరుసల రహదారి పనులకూ మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు చేశారు. వికారాబాద్ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానికులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రూ.173కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)



నూతనంగా నిర్మించిన సఖీ కేంద్రం

### అభివృద్ధి మెరుగు పడుతున్నది



వికారాబాద్ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే మంత్రి కేటీఆర్ కోట్లాది రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అవి పూర్తైతే ఈ ప్రాంతం సుందరంగా మారుతుంది. ప ట్టణ ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.96 కోట్ల నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉన్నది. గత పాలకులతో పోల్చుకుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో ప్రగతిపథంలో ముందుకెళ్తున్నది.

- ఎం.నాగయ్య, వికారాబాద్

### బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



వికారాబాద్ పట్టణాభివృద్ధికి మంత్రి కేటీఆర్ కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉన్నది. తద్వారా ఈ ప్రాంతం రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉ న్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాష్ట్రాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయి.

- శ్రీనివాస్, వీడీడీఎఫ్ అధ్యక్షుడు, వికారాబాద్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.

NT-320535

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భారతి హోలీకేరీ

# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ**

ఇబ్రహీంపట్నం, నవంబర్ 6 : కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన వ్యయ నియంత్రణ బృందానికి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌హెచ్ అజయ్‌బదూ, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఉన్నతాధికారులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌రేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ సూచనలు పాటిస్తున్నామని.. జిల్లావ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు అధికారులు, పోలీసులు మొత్తం రూ.116,11,87,195 నగదు, బంగారం సీజ్ చేసినట్లు తెలిపారు. అందులో రూ.32,03,99,163 నగదును, రూ.83,17,64,517 విలువగల ఆభరణాలు, 90,23,515 ఫ్రీబీస్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రీవెన్స్ కమిటీకి సంబంధించి వచ్చిన కేసులను పరిశీలించి సరైన ఆధారాలుంటే వాటిని డిస్పోజ్ చేసినట్లు తెలిపారు. ఆయా కేసుల్లో ఇన్‌కమ్‌టాక్స్, కమర్షియల్ ట్యాక్స్, జీఎస్టీ వారికి సమాచారం అందించి కేసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఇన్‌కమ్‌టాక్స్, జీఎస్టీ, కమర్షియల్‌టాక్స్ అధికారులతోపాటు ఫ్లయింగ్‌స్క్వాడ్ సర్వేలెన్స్, తదితర బృందాలతో ఇప్పటికే ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో తనిఖీల సమయంలో రూ.10లక్షల కంటే ఎక్కువ నగదు తదితరాలు లభించినట్లయితే ఇన్‌కమ్‌టాక్స్ వారికి పంపిస్తున్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని కఠినంగా, పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఈ విషయంలో పోలీసులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎంతో బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.